క్లుప్తంగా

క్రమశిక్షణకు మారుపేరు ఎన్‌సీసీ

ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట ఈస్ట్: క్రమశిక్షణ, దేశభక్తి, అంకిత భావానికి ఎన్‌సీసీ ప్రతీక అని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి తెలిపారు. శ్రీసుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల ఎన్‌సీసీ ఆఫీసర్ మేజర్ బిఎస్ఆర్‌కె రాజు ఎన్‌సీసీలో అత్యున్నత పురస్కారం డిజీ ఎన్‌సీసీ కమాండేషన్ కార్డ్ అవార్డు అందుకోవటాన్ని పురస్కరించుకుని గురువారం కళాశాల ఆడిటోరియంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి మాట్లాడుతూ కళాశాలలో ఎన్‌సీసీ ఆఫీసర్‌గా మేజర్ రాజు అందించిన సేవలను అభినందించారు. కార్యక్రమంలో కళాశాల పాలకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు కపలవాయి విజయకుమార్, నాగసరపు సుబ్బరాయగుప్త, ప్రిన్సిపల్ డాక్టర్ సోము మల్లయ్య, ఇంటర్మీడియేట్ ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.ఎస్.సుధీర్, పాలకవర్గ సభ్యులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉచిత విద్యకు 8 మంది ఎంపిక

వినుకొండ (నూజెండ్ల): విద్యాహక్కు చట్టం 2009 సెక్షన్ 12(1) సి ప్రకారం మండలంలోని ప్రైవేటు పాఠశాలలో ఉచిత విద్య కోసం 1వ తరగతి ప్రవేశానికి రిజిస్ట్రేషన్ చేసుకున్న విద్యార్థులకు మొదటి విడత లాటరీ తీసినట్లు ఎంఈవో జఫ్రుల్లా తెలిపారు. మండలంలోని ఐదు ప్రైవేటు పాఠశాలల్లో 8 మంది విద్యార్థులు ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు ఆయా పాఠశాలల్లో అడ్మిషన్లు ఇప్పించడం జరిగిందన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు, సీఆర్‌పీ వి.విశ్వనాథం, ఎంఈవో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సాతులూరులో రంజాన్ తోఫా పంపిణీ



నాదెండ్ల: ధనికులు తమ సంపాదనలో పేదల కోసం వెచ్చించి అంతరాలు లేని సమసమాజాన్ని నిర్మించాలని ఇస్లాం ప్రబోధిస్తుందని జ్ఞానేశ్వర ఫౌండేషన్ చైర్మన్ షేక్ జాన్‌సైదా చెప్పారు. నాదెండ్ల మండలంలోని అన్ని గ్రామాల్లో గురువారం జ్ఞానేశ్వర ఫౌండేషన్ ఆధ్వర్యంలో రంజాన్ తోఫా పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. చిలకలూరిపేట నియోజకవర్గంలో సుమారు 11 వేల మందికి తోఫా పంపిణీ చేయనున్నారు. నాదెండ్ల మండల పరిధిలో మొత్తం మూడు వేల మందికి 15 రకాల సరుకులతో కూడిన సంచిని అందించారు. ధనిక ముస్లింలు తమ సంపాదనలో కొంత భాగం జకాత్ రూపంలో పేదలకు పంచాలని ఇస్లాం ధర్మశాస్త్రాలు ఆదేశిస్తున్నాయన్నారు. గొరిజవోలు, సాతులూరు, కనపర్రు గ్రామాల్లో జాన్‌సైదాను ముస్లిం పెద్దలు శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కంజుల వీరారెడ్డి, వైసీపీ మండల పార్టీ మాజీ అధ్యక్షుడు గొంటు శ్రీనివాసరెడ్డి, చల్లా యజ్ఞేశ్వరరెడ్డి, ఈదర కోటయ్యస్వామి, గుంజి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

శావల్యాపురం సర్పంచ్‌గా చెన్నమ్మ

శావల్యాపురం: మండల కేంద్రం శావల్యాపురం గ్రామపంచాయతీ నూతన సర్పంచ్‌గా యాగసిరి చెన్నమ్మను నియమాకం ధృవీకరణ పత్రాన్ని అందజేసినట్లు ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య తెలిపారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో మాట్లాడుతూ ఇప్పటి వరకు సర్పంచ్‌గా విధులు నిర్వహించిన రాపూరి వెంకాయమ్మ దీర్ఘకాలిక సెలవుపై వెళ్ళగా జిల్లా పంచాయతీ అధికారి ఆదేశాలు మేరకు ఉప సర్పంచ్‌గా ఉన్న యాగసిరి చెన్నమ్మను సర్పంచ్‌గా నియమాకం చేసినట్లు చెప్పారు. ధృవీకరణ పత్రం అందుకున్న వారిలో మండల కోఆప్షన్ సభ్యు లు దూదెకుల హుస్సేన్, వైఎస్సార్‌సీపీ నేతలు చిట్టేటి రవి, బాబు, కొణతం ఎరుకల రెడ్డి, ఏసురాజు,పొట్టిపాటి శ్రీను ఉన్నారు.

పువ్వాడ హెచ్‌ఎం, ఉపాధ్యాయుడి సస్పెన్షన్

నూజెండ్ల : విధి నిర్వహణలో బాధ్యతారహితంగా వ్యవహరించిన ప్రధానోపాధ్యాయునితో పాటు, మరో ఉపాధ్యాయుడిని జిల్లా విద్యాశాఖాధికారి శామ్యూల్ సస్పెండ్ చేసినట్లు నూజెండ్ల ఎంఈఓ సాంబశివరావు గురువారం తెలిపారు. నూజెండ్ల మండలం పువ్వాడ గ్రామంలో ప్రధానోపాధ్యాయునిగా పనిచేస్తున్న నాగుల షరీఫా, అదే పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న శశి సుమంత్ ఇరువురు విద్యార్థుల ముందు ఘర్షణ పడుతూ బాధ్యతా రాహిత్యంగా వ్యవహరిస్తుండటంతో గ్రామస్తులు ఎంఈఓకు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేసిన ఎంఈఓ జిల్లా విద్యాశాఖ అధికారికి నివేదించారు. గురువారం సాయంత్రం శాఖాపరమైన చర్యలు తీసుకుని సస్పెండ్ చేసినట్లు తెలిపారు.

20 మండలాలకు 'వాటర్‌గ్రిడ్' తాగునీరు

- ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు
- వాటర్ గ్రిడ్ పథకాన్ని జేజేఎంతో అనుసంధానం
- నియోజకవర్గంలో అన్ని గ్రామాలకు తాగునీటి వసతి
- అర్హులైన ప్రతిపేదవాడికి ఇళ్లు నిర్మించి ఇస్తాం
- టీడీపీ నీచరాజకీయాలు మానుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

వినుకొండ(నూజెండ్ల): నియోజకవర్గంలో ప్రతి గ్రామానికి వాటర్ గ్రిడ్ పథకం ద్వారా తాగునీటి సౌకర్యం కల్పిస్తున్నట్లు, ప్రాజెక్టు నిర్మాణానికి శంకుస్థాపన కూడా జరిగినట్లు ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు వెల్లడించారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే బొల్లా మాట్లాడుతూ పల్నాడు జిల్లా కారంపూడి శ్రీచక్ర సిమెంటు ఫ్యాక్టరీ సమీపంలోని కొండపై 14 లక్షల లీటర్ల సామర్థ్యం గల ట్యాంక్ నిర్మాణం జరుగుతోందని, అక్కడి నుంచి బొల్లాపల్లి మండలం రేమిడిచర్ల, ఈపూరు మండలం, నూజెండ్ల మండలాల్లో ఎత్తయిన ప్రాంతాల్లో ట్యాంక్‌లు నిర్మించి జేజేఎం పథకం కింద ఇంటికీ కుళాయిల ద్వారా తాగునీటి సౌకర్యం కల్పిస్తున్నట్లు చెప్పారు. ఈ ఏడాదిలోనే ప్రాజెక్టు పనులు పూర్తవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

వినుకొండ తాగునీటికి ప్రత్యేక చర్యలు

వినుకొండ పట్టణానికి కూడా వాటర్ గ్రిడ్ ద్వారా వినుకొండ కొండపై ట్యాంక్ నిర్మించి జేజేఎం పథకం కింద అనుసంధానం చేసి తాగునీటి సౌకర్యం కల్పిస్తున్నట్లు చెప్పారు. ఇటీవల ముఖ్యమంత్రిని కలిసి వినుకొండ పట్టణానికి వాటర్ గ్రిడ్ అనుసంధానం చేయాలని కోరినట్లు చెప్పారు. ముఖ్యమంత్రి ఆదేశాలతో త్వరలోనే పనులు ప్రారంభమవుతాయని చెప్పారు. అర్హత ఉన్నవారు ఇంటి స్థలం కోసం దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఇంటి స్థలం ఉన్నవారికి కూడా ప్రభుత్వం సాయం అందిస్తుందన్నారు. టిడ్కో ఇళ్ల లబ్ధిదారులకు త్వరలోనే నిర్మాణాలను పూర్తి చేసి ఇళ్లను అందజేస్తామన్నారు. వినుకొండ పట్టణం నుంచి చుట్టుపక్కల గ్రామాలకు కూడా వాటర్ గ్రిడ్ ద్వారా నీటిని అందిస్తామన్నారు.

టీడీపీ నీచ రాజకీయాలు మానుకోవాలి

ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబు నాయుడు ప్రజల్లో ఆదరణ కోల్పోయి అసత్య ప్రచారాలు చేస్తున్నారని, 175 సీట్లలో టీడీపీ అభ్యర్థులను నిలబెట్టలేని స్థితిలో చంద్రబాబు ఉన్నారని విమర్శించారు. తమ పార్టీ ఒంటరిగా 175 స్థానాల్లో పోటీ చేస్తుందని ఇందులో ఎలాంటి సందేహం లేదన్నారు. స్వతహాగా గెలిచే శక్తి లేక సీపీఐ, సీపీఎం, జనసేన మద్దతు కోసం చంద్రబాబు పాకులాడుతున్నారన్నారు. వినుకొండ మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ముస్లిం వక్ఫ్‌బోర్డు భూములపై అసత్య ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో ఎంపీపీ జయశ్రీ వెంకట రామిరెడ్డి, జెడ్పీ కోఆప్షన్ మెంబరు గుండాల స్వైనోమ్, రవికిరణ్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

సహోద్యోగిని ఆదుకోవాలనే సంకల్పం గొప్పది

మృతిచెందిన హెడ్ కానిస్టేబుల్ కుటుంబానికి రూ.1.4 లక్షల నగదు అందజేత



మృతుడి కుమార్తెకు ఆర్థిక సహాయం అందజేస్తున్న ఏఆర్ అదనపు ఎస్పీ రామచంద్రరాజు

నరసరావుపేట: ఆపదలో ఉన్న తమ సహోద్యోగి కుటుంబానికి సహాయం అందించాలనే సంకల్పం, సేవా దృక్పథం ఎంతో గొప్పదని అదనపు ఏ.ఎస్పీ రామచంద్రరాజు కొనియాడారు. రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన సహచర హెడ్‌కానిస్టేబుల్ తాళ్లూరి సూర్యనారాయణ కుటుంబానికి తోటి 1993వ బ్యాచ్ హెడ్ కానిస్టేబుళ్లు, ఏఎస్సైలు అందించిన ఆర్థిక సహాయం రూ.1.4 లక్షల గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో మృతుడి కుమార్తె ప్రవల్లికకు అందజేశారు. స్థానిక రూరల్ పోలీస్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తూ గత నెల 12న రోడ్డు ప్రమాదంలో సూర్యనారాయణ మృతి చెందిన విషయం విదితమే. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ ఇదే ఐక్యత, ఉదారత భవిష్యత్‌లో కూడా కొనసాగించాలంటూ 1993 బ్యాచ్ వారిని అభినందించారు. హెడ్‌కానిస్టేబుల్ కుటుంబానికి పోలీస్‌శాఖ ఎల్లప్పుడూ తోడుగా, అండగా ఉంటుందన్నారు. వారికి శాఖాపరంగా రావల్సిన అన్నీ బెనిఫిట్లను అందిస్తామన్నారు. ఏఆర్ డీఎస్పీ చిన్నికృష్ణ, ఏఏవో రామారావు, ఎస్పీ సీసీ ఇఇ కోటేశ్వరరావు, పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు మాణిక్యాల రావు, ఏఎస్సై ఆంజనేయులు, భాస్కర్ రావు, అంకినీడు ప్రసాద్, ప్రసాద్ పాల్గొన్నారు.

బీఎల్‌వోలు విధులు పారదర్శకంగా నిర్వహించాలి


తహసీల్దారు జాన్‌సైదులు




మాట్లాడుతున్న తహసీల్దారు జాన్‌సైదులు

శావల్యాపురం: ఎన్నికల కమిషనర్ ఆదేశాలు మేరకు 18 సంవత్సరాల నిండిన వారందరికీ ఓటు హక్కు కల్పించే బాధ్యత ఆయా గ్రామాల్లోని బీఎల్‌వోలపై ఉందని తహసీల్దారు షేక్ జాన్‌సైదులు అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బీఎల్‌వోలకు నూతన ఓట్లు అర్జీలు స్వీకరణ, తిరస్కరణ, ఆన్‌లైన్ ఓట్లు దరఖాస్తులు తదితర వాటిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ గత ఆరు నెలల నుంచి ఫాం-6లు 800 అర్జీలు రాగా అందులో 105 తిరస్కరించినట్లు చెప్పారు. ఫాం-7లు 722 రాగా 84 అర్జీలు తిరస్కరించమన్నారు. సమగ్ర వివరాలతో ఓటు హక్కు కోసం అర్జీ చేసుకున్న వారందరికీ క్షేత్రస్థాయిలో విచారణ చేసి నిర్ధారణ అయినటు వారికి పార్టీలకు అతీతంగా ఓటు హక్కు కల్పించాలన్నారు. గ్రామాల్లో ఏమైనా ఇబ్బందులు ఉన్న పక్షంలో తక్షణమే మండల స్థాయి అధికారుల దృష్టికి తేవాలన్నారు. ఓట్లు చేర్పులు, తొలగింపులు విషయంలో ఫిర్యాదులకు వివాదాలకు తావులేకుండా తమ విధులు పారదర్శకంతో ఉండాలన్నారు. రానున్న ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి అవకతవకలకు పాల్పడకుండా బీఎల్‌వోలు తమ విధుల అంకిత భావంతో నిర్వహించాలన్నారు. ఈ సదస్సులో ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య, ఆర్ఐ చంద్రబాబు పాల్గొన్నారు.

ముగిసిన అగ్నిమాపక వారోత్సవాలు



వినుకొండలో మాట్లాడుతున్న డాక్టర్ కుర్రా శ్రీనివాసరావు




చిలకలూరిపేటలో అగ్నిమాపక పరికరాల ఎగ్జిబిషన్ తిలకిస్తున్న విద్యార్థులు

వినుకొండ టౌన్: అగ్నిమాపక వారోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని స్థానిక అగ్నిమాపక కేంద్రం వద్ద గురువారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పట్టణానికి చెందిన దంత వైద్య నిపుణులు కుర్రా శ్రీనివాసరావు హాజరయ్యారు. పరిసర ప్రాంత ప్రజలకు గ్యాస్ సిలిండర్ లీకేజీ, షార్ట్ సర్క్యూట్ వలన అగ్నిప్రమాదం సంభవించినప్పుడు, తీసుకోవలసిన జాగ్రత్తలపై అగ్నిమాపక శాఖ అధికారులు, సిబ్బంది అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐసీఎస్ఎఫ్ ఎం. శ్రీనివాసరావు, డీటపి రమణారెడ్డి, ఎల్ఎఫ్‌లు డి. ప్రకాష్‌రావు, ఎ. వెంకటేశ్వర్లు, ఎఫ్ఎంలు కేశవబాబు, ప్రభాకర్‌రెడ్డి, కోటేశ్వరరావు, మస్తాన్, మల్లికార్జునరావు, హోంగార్డ్స్ పి. బాషాఖాన్, జి. రామకృష్ణారావు, సిబ్బంది పాల్గొన్నారు.

చిలకలూరిపేటలో....

చిలకలూరిపేట: అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కలిగి ఉండాలని ఇన్‌చార్జి స్టేషన్ ఫైర్ ఆఫీసర్ ఎస్ భాస్కరబాబు చెప్పారు. అగ్నిమాపక వారోత్సవాల ముగింపు సందర్భంగా అగ్ని మాపక కేంద్రంలో విద్యార్థులకు అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించే వర్క్‌షాపును గురువారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తల పట్ల వారోత్సవాల సందర్భంగా విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు చెప్పారు. అగ్నిమాపక కేంద్రంలో ఏర్పాటు చేసిన ఫైర్ ఎగ్జిబిషన్ స్టాల్ ద్వారా విద్యార్థులకు అగ్నిమాపక పరికరాలు, రిస్క్యూ ఎక్యుప్‌మెంట్స్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది ఆర్ మాణిక్యరావు, వి.నాగేశ్వరరావు, ఎస్.వెంకయ్య, పవన్‌కుమార్, చిన్నబ్బాయి, కరిముల్లా తదితరులు పాల్గొన్నారు.

పీజీ కోర్సులపై అవగాహన సదస్సులు



సదస్సులో మాట్లాడుతున్న వర్సిటీ అడ్మిషన్స్ డైరెక్టర్ డాక్టర్ అనిత

నరసరావుపేట ఈస్ట్: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ ఆధ్వర్యంలో గురువారం పట్టణంలోని వివిధ కళాశాలలో విద్యార్థులకు పోస్ట్ గ్రాడ్యూయేట్ (పీజీ) కోర్సులపై అవగాహన సదస్సులు నిర్వహించారు. ఆయా సదస్సులలో అడ్మిషన్స్ డైరెక్టరేట్ డైరెక్టర్ డాక్టర్ జి.అనిత మాట్లాడుతూ డిగ్రీ అనంతరం పీజీ కోర్సులను చదవటం వలన కలిగే ప్రయోజనాలను తృతీయ సంవత్సరం విద్యార్థులకు వివరించారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో అందుబాటులో ఉన్న పీజీ కోర్సులు, క్రీడలకు వర్సిటీ ఇస్తున్న ప్రాధాన్యత, డాక్టరేట్ చేసేందుకు ఉన్నటువంటి అవకాశాలు, హాస్టల్ వసతి, తదితర అంశాలను వివరించారు. అలాగే ఏపీ పీజీ సెట్-2023పై అవగాహన కలిగించారు. పీజీ ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, అడ్మిషన్ల వివరాలను తెలిపారు. పట్టణంలోని కృష్ణవేణి డిగ్రీ కళాశాల, పీఎన్‌సీ అండ్ కె.ఆర్.డిగ్రీ కళాశాలల్లో నిర్వహించిన సదస్సులలో వర్సిటీ ఎన్వీరాన్‌మెంటల్ స్టడీస్ విభాగాధిపతి డాక్టర్ పి.బ్రహ్మాజీ, సోషియాలజీ, సోషల్‌వర్క్ విభాగాధిపతి డాక్టర్ ఎం.త్రిమూర్తిరావు, కృష్ణవేణి కళాశాల ప్రిన్సిపల్ నాతాని వెంకటేశ్వర్లు, పీఎన్‌సీ కళాశాల ప్రిన్సిపల్ మేజర్ జి.వెంకటేశ్వరరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహన దొంగల అరెస్ట్

ఐదు వాహనాలు స్వాధీనం



నరసరావుపేట టౌన్: ద్విచక్ర వాహనాల చోరీ కేసులో ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి ఐదు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ విజయ భాస్కరరావు, టూటౌన్ సీఐ వీరేంద్రబాబులు తెలిపారు. గురువారం డీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో కేసు వివరాలను వెల్లడించారు. గుంటూరు రోడ్డులో వాహనాలు తనిఖీ చేస్తుండగా ద్విచక్రవాహనంపై తమ్మిశెట్టి శివనాగరాజు, దారపనేని వెంకట సాంబశివరావు ద్విచక్రవాహనంపై వస్తూ పోలీసులను చూసి పారిపోయే ప్రయత్నం చేశారన్నారు. వెంబడించి వారిద్దరిని అదుపులోకి తీసుకున్నామన్నారు. విచారణలో నరసరావుపేట పరిసర ప్రాంతాల్లో గత కొన్ని నెలలుగా ద్విచక్రవాహనాలు దొంగలించి విక్రయించి సొమ్ము చేసుకున్నట్లు నేరాన్ని అంగీకరించారు. నిందితులు ఇచ్చిన సమాచారంతో చోరీకి గురైన ఐదు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు నిందితులపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు.

యువకుడి ప్రాణాలు తీసిన అప్పులు



నరసరావుపేట రూరల్: అప్పుల బాధతో యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని రావిపాడులో చోటు చేసుకుంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాలు రావిపాడు గ్రామానికి చెందిన అముదాల వెంకట శ్రీనివాసరావు (31) గతంలో ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలలో కార్యాలయ సిబ్బందిగా పనిచేసేవాడు. తన తండ్రి ఆరోగ్యం దెబ్బతినడంతో ఆయనకు తోడుగా కొంత పొలాన్ని కౌలుకు తీసుకుని సాగుచేస్తున్నాడు. తండ్రి ఆసుపత్రి ఖర్చుల కోసం అప్పులు కావడంతో పాటు వ్యవసాయం కూడా కలిసి రాకపోవడంతో అప్పుల భారం పెరిగింది. దీంతో ఈనెల 19వ తేదీ బుధవారం ఉదయం ఇంటి నుంచి వెళ్లిన శ్రీనివాసరావు వల్లప్పచెరువు నుంచి కేతముక్కల అగ్రహారం వెళ్లేదారిలో పొలంలో పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతురాలి భార్య చంద్రకుమారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ బాలనాగిరెడ్డి తెలిపారు.

వీధి కుక్కల నియంత్రణకు చర్యలు చేపట్టాలి

శావల్యాపురం: మండలంలోని వయ్యకల్లు గ్రామంలో వీధి కుక్కల నియంత్రణకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్యను, సర్పంచ్ గోనుగుంట్ల వెంకటేశ్వర్లు కోరారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గ్రామపంచాయతీలో నెలకొన్న సమస్యలపై సర్పంచ్, ఎంపీడీవోను స్వయంగా కలిశారు.

ప్రార్థనా స్థలాల పవిత్రత కాపాడాలి



పురుషోత్తమపట్నం ఈద్గా వద్ద పనులు పర్యవేక్షిస్తున్న రఫాని, గోవిందరావు

చిలకలూరిపేట: ప్రార్థనా స్థలాల పవిత్రత కాపాడుకోవడం మనందరి బాధ్యత అని మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని చెప్పారు. రంజాన్ పండుగను పురస్కరించుకొని అడ్డరోడ్డు సెంటర్, పురుషోత్తమపట్నం లోని ఈద్గా మైదానాలను మున్సిపల్ అధికారులతో కలసి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంజాన్ ప్రార్థనలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురు కాకుండా ఆక్రమణలను తాత్కాలికంగా తొలగిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సీహెచ్ గోవిందరావు, డీఈఈ తోట వెంకటరమణ, టీపీఎస్ కె సునీత, 29వ వార్డు కౌన్సిలర్ షేక్ యూసుఫ్‌ఆలి, 27వార్డు ఇన్‌చార్జి దరియావలి తదితరులు పాల్గొన్నారు.

ముస్లింల అభివృద్ధి, సంక్షేమానికి కృషి



నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గోపిరెడ్డి, ఖాజావలి, మిట్టపల్లి

- నిత్యావసరాల పంపిణీలో ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి

నరసరావుపేట: నియోజకవర్గంలో ముస్లిం సోదరుల అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం ఇతోధికంగా కృషి చేస్తోందని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. గురువారం స్థానిక వరవకట్ట 17వ వార్డులో ఆల్ ఈజ్ వెల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పవిత్ర రంజాన్ మాసం పురస్కరించుకుని పేద ముస్లింలకు నిత్యావసరాలు (రంజాన్ తోఫా) పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఎమ్మెల్యే గోపిరెడ్డి మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వంలో ఒక్క ముస్లింకు అవకాశం ఇవ్వకుండా మంత్రివర్గాన్ని ఏర్పాటు చేసిన చంద్రబాబునాయుడు ఇప్పుడు మళ్లీ ఉద్ధరిస్తానంటూ బయలుదేరాడని దుయ్యబట్టారు. ప్రస్తుత ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఉపముఖ్యమంత్రి పదవితో పాటు ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రభుత్వ సలహాదారుగా సినీనటులు ఆలీని నియమించారన్నారు. నలుగురికి ఎమ్మెల్సీ పదవులు ఇవ్వటంతోపాటు 40 మంది ముస్లింలకు ప్రభుత్వంలో ప్రతిష్టాత్మకమైన స్థానాలు ఇచ్చారన్నారు. నియోజకవర్గంలో అనేక మసీదుల అభివృద్ధికి ఇప్పటి వరకు రూ.16 లక్షల వరకు తన సొంత నిధులు అందజేశామన్నారు. సుమారు రూ.2 కోట్లతో జామియా మసీదు నిర్మాణం చేపట్టామని మరో మూడు నెలల్లో అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. షాదీఖానాను రూ.21 లక్షల వ్యయంతో ఆధునీకరించామన్నారు. బరంపేటలో నూతన షాదీఖానా ఏర్పాటుతో పాటు నూతన మసీదు నిర్మాణం చేపట్టామన్నారు. ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేయటంతో పాటు వలంటీర్ల వ్యవస్థ ద్వారా తెల్లవారుజామునే ఇళ్లకు వచ్చి పింఛన్లు అందజేస్తున్నారన్నారు. నియోజకవర్గ వాసులకు రంజాన్ శుభాకాంక్షలను తెలిపారు. షేక్ కార్పొరేషన్ చైర్మన్ ఖాజావలి, పొడా చైర్మన్ మిట్టపల్లి రమేష్‌తో కలిసి పలువురు ముస్లింలకు నిత్యావసరాలు పంపిణీ చేశారు. మాజీ కౌన్సిలర్ షేక్ మున్నీతో పాటు ఫౌండేషన్ ప్రతినిధులు, వరవకట్ట నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికీ సంక్షేమ లబ్ధి



సాతులూరులో మానమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమంలో గృహసారధులు, నాయకులు



మన్నేపల్లి తండాలో మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమంలో పాల్గొన్న కన్వీనర్

వేర్వేరు గ్రామాల్లో ఉత్సాహంగా 'మా నమ్మకం నువ్వే జగనన్న'

నాదెండ్ల: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు లబ్ధి చేకూరిందని వైఎస్సార్ సీపీ నాయకులు గద్దె కోటేశ్వరరావు, ఆంజనేయులు చెప్పారు. మండలంలోని సాతులూరు గ్రామంలో గురువారం మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమం నిర్వహించారు. గ్రామ వలంటీర్లు, గృహ సారధులు, కన్వీనర్లు, పార్టీ నాయకులు ఇంటింటికీ తిరిగి గడిచిన నాలుగేళ్లలో ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. గృహ యజమానుల అనుమతితో జగన్‌మోహన్ రెడ్డి స్టిక్కర్‌ను అంటించారు. మాజీ సర్పంచ్ వింధ్యారాణి, డీలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కమ్మ సీతారామయ్య, షేక్ బాజి, యర్రమనేని వాసు, బి.సాంబయ్య, సోమయ్య, కోట ఏలియా, ఉప్పలపాటి కొండలు, జాగర్లమూడి కోటేశ్వరరావు, జాన్‌పీరా పాల్గొన్నారు.

మన్నేపల్లి తండాలో...

బొల్లాపల్లి: మా నమ్మకం నువ్వే జగన్- జగనన్నే మా భవిష్యత్ మండలంలోని ప్రతి గ్రామంలో కొనసాగుతోంది. గురువారం మన్నేపల్లి తండాలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ తిరిగి సంక్షేమ పథకాల గురించి వివరించారు. తండాలో ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు అందాయని జీడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ డి.గోవిందునాయక్ తెలిపారు. ప్రతి కుటుంబం ముఖ్యమంత్రి ప్రవేశపెట్టిన సంక్షేమంతో లబ్ధి పొందిందని తెలిపారు. కరోనా కష్టకాలంలో సంక్షేమ పథకాలు ఆదుకున్నాయని గుర్తు చేశారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ పి.అవినాష్‌రెడ్డి, బత్తి గురవయ్య, సర్పంచ్ గోవిందునాయక్, మన్నెయ్య, లక్ష్మనాయక్, గృహ సారధులు పాల్గొన్నారు.

యడ్లపాడు మండలంలో....

యడ్లపాడు: మండలంలోని పలు గ్రామాల్లో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం జరిగింది. కారుచోల, యడ్లపాడు, మర్రిపాలెం తదితర గ్రామాల్లో గురువారం వైఎస్సార్‌సీపీ నాయకులు, గృహసారథుల ఆధ్వర్యంలో నిర్వహించారు. గ్రామంలోని కుటుంబాలను కలిసి ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి వారు వివరించారు. కుటుంబ యజమానుల అనుమతితో వారి ఇళ్ల గోడలపై, సెల్‌ఫోన్లపై జగనన్న స్టిక్కర్లను అతికించారు. అనంతరం రాష్ట్ర పార్టీ ఇచ్చిన టోల్‌ఫ్రీ నంబర్లకు ఆయా కుటుంబాల సెల్‌ఫోన్ల ద్వారా మిస్డ్‌కాల్స్ చేయించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల పార్టీ నాయకులు, కార్యకర్తలు, గృహసారధులు పాల్గొన్నారు.

దాహార్తి తీర్చటం అభినందనీయం



తహసీల్దార్ కార్యాలయం వద్ద చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

శావల్యాపురం: వేసవిలో ప్రజల దాహార్తి తీర్చటానికి చలివేంద్రం ఏర్పాటు చేయటం అభినందనీయమని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. గురువారం మండలంలోని గంటావారిపాలెం గ్రామం జాతీయ రహదారి మార్గం వెంబడి ప్రధాన కూడలి బస్టాండ్ సెంటరులో ప్రయాణికులు, వాహనదారుల తాగునీటి కోసం చెన్నా శ్రీనివాసరావు (సీఎస్ఆర్) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ చలివేంద్రాన్ని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు మాట్లాడుతూ సీఎస్ఆర్ యూత్ ఆధ్వర్యంలో గత ఆరు సంవత్సరాల నుంచి చలివేంద్రం ద్వారా ప్రజల దాహార్తి తీర్చటం అభినందనీయమన్నారు. ఇలాంటి సేవాచేసే గుణం ప్రతి ఒక్కరిలో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు బొల్లికొండ బ్రహ్మనందం, మారిశెట్టి శివారంప్రసాదు, చిలుకూరి లక్ష్మీనారాయణ, చెన్నంశెట్టి మణికంఠ గ్రామస్తులు పాల్గొన్నారు.

బొల్లాపల్లిలో చలివేంద్రం ఆరంభం

బొల్లాపల్లి : రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ వి.సుధాకర్‌శర్మ గురువారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. కలెక్టర్ జేసీ ఆదేశాల మేరకు రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేయడమైనదన్నారు. వేసవిలో మండుతున్న ఎండలను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వ కార్యాలయాల వద్దకు వచ్చే ప్రజల సౌకర్యం కోసం తాగునీటిని ఏర్పాటు చేశామని, ఈ క్రమంలో చలివేంద్రం పెట్టామని తెలిపారు. ప్రస్తుతం ఈ ప్రాంతంలో 40 డిగ్రీల ఉష్ణోగ్రతతో ఎండలు మండుతున్నాయని చెప్పారు. ప్రజలు చలివేంద్రాన్ని సద్వినియోగపరచుకోవాలని సూచించారు. ప్రారంభించిన వారిలో ఇన్‌చార్జి ఎంపీడీవో టి.పార్వతి, పార్టీ నాయకులు బత్తి గురవయ్య, రామావత్ కృష్ణానాయక్, ఆర్. బంగినాయక్, గోవిందయ్య తదితరులు పాల్గొన్నారు.

మిషన్ శోభాకృత్‌లో జీపు వేలం

వినుకొండ(నూజెండ్ల): మిషన్ శోభాకృత్ పథకంలో భాగంగా స్థానిక తహసీల్దార్ కార్యాలయంలోని జీపును వేలం వేశారు. ఈ వేలం కార్యక్రమంలో పులిచింతల డిప్యూటీ కలెక్టర్ శ్రీరాములు, తహసీల్దార్ కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ వేలంలో నలుగురు పాల్గొనగా ప్రకాశం జిల్లా అద్దరోడ్డుకు చెందిన పఠాన్ ఆదాం షఫీ అనే వ్యక్తి రూ.33వేలకు వేలంపాటలో వాహనాన్ని దక్కించుకున్నాడు. తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.